
ఈ వారం కథ



# ఎలా బ్రతకాలి?

— నాగులకొండ

"బాబుగారూ అబ్బిగాడి దగ్గర్నించి వుత్తరవొచ్చింది. కొంచెం సదివిపెట్టండి బాబుగారూ" అంటూ అటుగా వెళ్తోన్న మాష్టార్ని పిలిచేడు జోగారావు.

ఆ పిలుపుతో దగ్గరికి వచ్చారు మాష్టారు.

బొడ్లో వున్న ఉత్తరం తీసి మాష్టారికి ఇచ్చేడు జోగయ్య. ఆయన చదవడం ప్రారంభించారు. ఆనంద బాష్పాలతో వినసాగేడు జోగయ్య.

"ప్రియమైన అయ్యకి,

శంకరం నమస్కరించి ప్రేమతో వ్రాయునది - నేను పట్నం వచ్చిన కొత్తలో అంటే రెండు మూడు రోజులు చాలా బాధపడినా, నేను చదువుకొని వుండడం వల్ల నాలుగో రోజు నాకు ఉద్యోగం దొరికింది. ఈ ఉద్యోగానికి మొదట ఆరునెలలు ట్రైనింగ్ పిరీడ్ వుంది..."

"అంటే ఏటి బాబుగారూ" చదువుతున్న మాష్టార్ని ఆపుతూ అర్థం కాక అడిగేడు జోగయ్య.

'అంటే ఆ పని పూర్తిగా తెల్సుకోవడానికి ముందు నేర్పడమన్న మాట'...."ఉండడానికీ, భోజనానికీ సౌకర్యంగానే వుంది. జీతం ఈ ఆరు నెలల తరువాత వాళ్లే నిర్ణయిస్తారు. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవలయును. . .

నేను మనూరి నుంచి వచ్చిన తర్వాత, నిన్ను అన్న మాటలకి చాలా బాధపడ్డాను. నువ్వు 'మన పని చేసుకుంటే తప్పలేదు' అని అన్నప్పుడు ఆలోచన లేకుండా ఆవేశపడి నిన్ను నానా తిట్లు తిట్టేను. నిన్ను తిడితే నన్ను తిట్టుకున్నట్టే అని గ్రహించుకోలేక పోయాను. చిన్నప్పట్నుంచీ అమ్మలేదని నేనేనాడూ బెంగపెట్టుకోలేదు. అన్నిటికీ నువ్వే అయ్యావు. మాదిగ కులంలో పుట్టినా చచ్చిపోయిన దూడల్నూ, ఆవుల్నూ, గేదెల్నూ, ఎద్దుల జోలికి ఏనాడూ నన్ను పోనివ్వలేదు. ఏనాడూ ఎవరి కాలి చెప్పు కుట్టమని నువ్వు నాకు చెప్పలేదు. కానీ ఆ రోజు ఊరు సర్పంచ్ మాధవయ్య చెప్పు తెగిందని ఇంటికొచ్చేడు. నువ్వు బయటికి వెళ్లేవు. నేను ఆయనతో నువ్వు లేవని చెప్పేను. నన్ను కుట్టమని అన్నాడు. 'నాకు తెలియదు అయ్య వచ్చాక రండి' అన్నాను. దాంతో అతను కోపగించేడు. "ఏంట్రా ... మీ అయ్య కోసం పడిగాపులు కాయమంటావా... ఎదవన్నర ఎధవా" అన్నాడు.

"పోనీ చెప్పిచ్చి వెళ్ళండి ... కుట్టించి పెడతాను" అంటే అతను తిడుతూనే, కాలికి వున్న చెప్పుని చేతితో తీసి ఇవ్వకుండా కాలితోనే విసిరికొట్టేడు. అలా విసిరి కొట్టేడని నీకు ఇప్పటి వరకూ చెప్పలేదు. కానీ నువ్వు "కుట్టివ్వలేకపోయేవేరా ... ఆ... ఊరికి పెద్ద తలకాయి వూళ్ళో వున్నాం ... తెల్లార్తే ఆల్ల దగ్గర పావలడబ్బులు తెచ్చుకోవల్సిన వాళ్ళమి ... చదువుకుంటే సరి పోదు... కాస్త మంచీ చెడ్డా చూసుకోవాలి" అని చెప్పేవు.

నేను వద్దంటున్నా పెద్ద చదువు చదివించేవు. ఏనాడూ నన్నొకమాట అని ఎరుగని నువ్వు అలా మాట్లాడేసరికి నేను అలిగి పట్నం వచ్చేశాను. సర్పంచ్‌గారి చెప్పు కుట్టకుండా పెద్ద ఎమ్.ఎ. చదువుకున్నాననే గర్వంతో నిర్లక్ష్యం చేశాను, నీకు బాధ కలిగించాను, కావున అవన్నీ మనసులో పెట్టుకోవద్దు. ఈ ఆరు నెలల ట్రైనింగ్‌లో నేను నీ దగ్గరికి రావడానికి వీలుపడదు. ఎవ్వరినీ రానివ్వరు. అందువల్ల ఈ ట్రైనింగ్ అయిపోయిన వెంటనే నేను మనూరు వస్తాను. సర్పంచ్ గారిని క్షమాపణలు అడుగుతాను. ట్రైనింగ్‌లో వాళ్లిచ్చే డబ్బు నెలకు 100 రూపాయిలు చొప్పున నీకు పంపిస్తాను. నాలుగో నెల నుంచి నెలకు 200 రూపాయిలు చొప్పున పంపిస్తాను. ఈ ఉత్తరంతో పాటూ నేను పంపిన వంద రూపాయిలు అంది వుంటాయని అనుకుంటాను. అయ్యా ... నువ్వు గంజి తాగడం మానెయ్యి. ఈ రోజుది మర్నాడూ, నిన్నటిది ఈవ్వాళా తినడం మానెయ్యి. నీకూ నాకూ అక్కడే తగాదా వచ్చేది. నేను సంపాయించే సంపాదనకి గంజి మెతుకులైనా దొరుకుతున్నాయనీ, మనం ఏం తిన్నామన్నది కాదు కావల్సింది - నేనలా కష్టపడడం వల్లే అర ఎకరం సెక్క సంపాయించ గలిగేననీ - అలా తినద్దని చెప్పినందుకు ఒకటి రెండు సార్లు నువ్వు నన్ను విసుక్కున్నావు. నేనంటూ సంపా యిస్తే నిన్ను గంజి తాగనియ్యకుండా బాగా చూసుకోనా అని ఎప్పుడూ బాధపడుతుండేవాడిని. అందుకే నువ్వు నన్ను దీర్ఘాలోచన చెయ్యొద్దని అంటుండేవాడివి. నాకిక్కడ సౌకర్యాలన్నీ బాగున్నాయి. నేను కోరేది నువ్వు శుభ్రమైన భోజనం చెయ్యాలని అయ్యా. నేను మరలా లెటర్ రాస్తాను. ఎక్కడికెళ్లి పోయానోనని కంగారు పడద్దు. నువ్వు ధైర్యంగా వుండు.

ఇట్లు

నీ కుమారుడు

అప్పికట్ల శంకరం,

4, జీడిల వెంకయ్య వీధి,

షరాఫ్ బజారు.

సమాజం నిచ్చెనలో అట్టడుగు మెట్టున వున్నవాడు తనకు ఓ అడుగు పైనున్న మెట్టుకు చేరాలన్నా చేరలేదు. చేరడమూ చేరలేక పోవడమూ అలా వుండనిస్తే పైకి చేరాలనుకుంటున్న వాడి ప్రయత్నం కూడా బహిరంగం కావడానికి వీల్లేదు. బహుశా యిదే అతన్ని మరింత బలహీనున్ని చేస్తున్నదేమో! అడుగునున్నవాడు అడుగు పైకి ఎదగడానికి ఇంత పోరాడవలసివున్నా పైనున్నవాడు ఇంకా పైకి వెళ్ళిపోవడానికి మాత్రం ప్రత్యేకించి ఏ పోరాటమూ అవసరం లేదంటే ఎంత చిత్రం!

లెటర్ అంతా చదివారు మాష్టారు.

కన్నీరు కార్చాడు జోగయ్య. అతని చేతిలో కొడుకు పంపిన 100 రూపాయిల నోటు వుంది.

"అధైర్యపడకు జోగయ్యా ... నీ కొడుకేమీ తెలివి తక్కువ వాడు కాదు. చదువుకున్నవాడు. నిన్ను బాగా చూసుకోవాలని కోరుకోవడంలో తప్పు లేదు ... ఊరుకో... అయినా ఇప్పుడు ఎక్కడికెళ్లిపోయేడని - ఎడ్రస్సు కూడా ఇచ్చేడు. నేనెప్పుడైనా పట్నం వెళ్లినప్పుడు చూసి వస్తానులే ... నువ్వు ఏడవకు జోగయ్యా ..." ఏడుస్తోన్న జోగయ్యని ఓదార్చేరు మాష్టారు.

* * *

సప్లయర్ రవి ఎంతసేపటికీ బయటికి రావడం లేదు. మిగతా సప్లయర్స్ అందరూ మీల్స్ టేబుల్ దగ్గరికి వచ్చి సప్లై చేస్తున్నారు. రవి రాకపోవడంతో 'కృష్ణ కాఫీ అండ్ భోజన హోటల్ ప్రొప్రయిటర్ మూర్తి అక్కడ వున్న సప్లైయర్ పాపారావుని చూసి,

"ఏరా! పాపారావు ... ఆ రవి ఏడీ ... కస్టమర్స్ అంతా భోజనానికి కూర్చొని వున్నారు. అసలు కనపడ దేంటీ ... పని ఇచ్చేంత వరకూ పని కోసం పాకులాడతారు. తీరా ఇచ్చిన తర్వాత ఎదవ నీలుగుడూ ... స్టైలూను ... పిలువ్ ... పిలిచి ఏం కావాలో వడ్డించమనూ ..." కోపంగా ఆజ్ఞాపించాడు పాపారావుతో మూర్తి.

పాపారావు అప్పడాలు ఆకుల్లో వేసి లోపలికి వెళ్లేడు.

రవి పార్శిల్ కేరేజీల్లో అన్నం, కూరలు, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నీ పెడుతున్నాడు.

"రవీ ... ఓనర్ పిలుస్తున్నాడురా..." వేగంగా నడుచుకుంటూ వచ్చి రవితో అన్నాడు పాపారావు.

"ఒరేయ్ ... నేను కేరేజీలు పార్శిల్ చేస్తున్నానని చెప్పరా..." అన్నాడు రవి కూరలు సెట్ గిన్నె తీసుకెళ్తున్న పాపారావుతో.

పాపారావు అందరికీ ఆకుల్లో కూరలు వడ్డించి ఓనర్ దగ్గరికెళ్ళి రవి అన్న మాటను చెప్పేడు. దాంతో మండిపడ్డాడు ఓనర్.

"పార్శిల్ ఇంకొకడెవడైనా చూస్తాడురా కస్టమర్లని ఆకుల ముందు కూర్చోపెట్టి ఏంట్రా వాన్నడం ... వాడ్ని కూడా వచ్చి వడ్డించమను..."

హోటల్లోకి జనం గుంపులు గుంపులుగా రావడంతో. అదమాయింపుగా పాపారావుతో అన్నాడు మూర్తి.

ఓనర్ కేష్ కౌంటర్‌లోంచి అన్న మాటలు రవితో చెప్పేడు పాపారావు.

"అది కాదు పాపారావ్ ... కస్టమర్లలో మావూరతను వచ్చేడు. అతన్ని చూసి నేను ఇక సప్లైకి వెళ్లలేదు. మధ్య టేబిల్లో ఎర్ర డిజైన్ చొక్కా వేసుకున్నాడే ... అతనే."

అంటూ అటువైపు తిరిగి భోంచేస్తోన్న ఒక ఎర్ర డిజైన్ చొక్కా వ్యక్తిని చూపించేడు రవి. అతన్ని చూశాడు పాపారావు.

"అతను వెళ్లిపోయిన తర్వాత నేను సప్లై చేస్తాను. అంతవరకూ నువ్వు సర్దిపెట్టు..." ప్రాధేయపడుతున్నట్టుగా అన్నాడు రవి పాపారావుతో. 'సరే' అని వెళ్లేడు అతను.

రవికి అతన్ని తప్పించుకుని వచ్చేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. చిన్ననాటి స్నేహితుడు. ఈనాటి స్నేహితుడు కూడా. "తనని ఈ పరిస్థితిలో చూసి వుంటాడా? ... ఒకవేళ చూసివుంటే ఏమనుకుంటాడు?... తెలిస్తే మాత్రం వూరిలో చెప్పేస్తాడు. పరువుపోతుంది ... అవునూ ... పరువు అంటున్నాను. బతుక్కి ఠికాణాలేని తర్వాత పరువుండి ఏం ప్రయోజనం?... అలా అని ఎదుట పడనూ లేను ... ఏవిటో ఈ జీవితం ... అతను ఇంకా వెళ్లేడో లేదో, ఏంటో" అంటూ భోజనం హాల్లోకి చూశాడు. అతను ఇంకా భోంచేస్తున్నాడు.

"ఒరేయ్ ... రవిగాడేడిరా ... ఎక్కడ చచ్చేడు?"

"అర్జంటయితే దొడ్లోకెళ్లేడండీ" ... కోపంగా అడిగిన ఓనర్ ప్రశ్నకు టక్కున బదులిచ్చేడు పాపారావు - తన చేతిలో మజ్జిగ కేన్‌లోంచి గరిటతో తీసి సాంబారు అడిగిన వాడికి వేసేస్తూ. లబోదిబోమన్నాడు ఆకలితో నాలుగు మెతుకులు ఎక్కువ తిందామను కున్న ఆ కస్టమర్.

పాపారావు చేసిన పనికి కస్టమర్ అరుస్తుంటే సీట్లోంచి లేచాడు ఓనర్ మూర్తి.

పాపారావు ఆరేడేళ్లుగా ఆ హోటల్లో పని చేస్తున్నాడు. అందువల్ల అతనేమన్నా ఓనర్ అంతగా పట్టించుకోడు. కొత్తగా ఎవరైనా చేరితే తన కోపమంతా వాళ్ల మీద ప్రయోగిస్తాడు పాము బుసలా.

మూర్తి బొజ్జ వూపుకుంటూ చరచరా లోపల వంటశాలలోకి వచ్చేడు. రవి కేరేజీలన్నిటిలోనూ అన్నం పెట్టి సర్దాడు.

"ఊ... అయిందా సర్దడం ... కౌంటర్ ప్రక్కనే పేపర్లున్నాయి పట్రా..." తను చెప్పిన పనినే చెయ్యాలనే ధీమాతో అన్నాడు మూర్తి రవితో.

రవికి ముచ్చెమటలు పోశాయి. ఎర్ర చొక్కా అతను వెళ్లిపోయి ఉండచ్చని అనుకొన్నాడు. కానీ అతనింకా తింటూనే వున్నాడు. 'ఒరి నీ తిండి తగలెయ్యా' మనసులోనే గొణుక్కుని తిరిగి వంటశాలలోకి వచ్చేశాడు వెళ్లబోయిన వాడల్లా.

"ఏం ... పేపర్లు తేలేదా?"

పులిలా గాండ్రిస్తూ కసురుతున్నాడు ఓనర్.

ఆ స్థితిలో తనకొక ఆలోచన తట్టింది.

"దొడ్లోకెళ్లొస్తాను అండీ ... రెండు నిమిషాలు..."

"ఇప్పుడే కదరా వెళ్లేవ్ దొడ్లోకి ... వంటల్లో చేరేవ్



... నా నెత్తిన చెంగు వేయించుదామనుకుంటున్నావేంట్రా... నీకబిగిన పోగు లాగించేస్తున్నావా? ఎదవా ఎళ్లరా'' కోపంగా గుడ్లెర్ర చేశాడు ఓనర్.

కౌంటర్ దగ్గరికి వెళ్ళక తప్పింది కాదు.

బట్టల్ని చూసుకున్నాడు. చూసినా చూసినట్లు తెలియదనిపించింది. ఆ ఎర్ర చొక్కా అతను తనతోపాటే వచ్చిన ఇద్దరితో ఏవో సరదాగా మాట్లాడుకుంటున్నట్టు నిపించింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ కౌంటర్ దగ్గరికెళ్లి పేపర్లు తీసుకున్నాడు.

భోజనం తినడం ముగించి ఆకు మడిచాడు ఎర్రచొక్కా అతను. రవి తిరిగి వస్తుండగా అతను సీట్లోంచి పైకి లేచి రవిని గుర్తుపట్టి ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ రవి దగ్గరకి వచ్చాడు. రవి అతను నవ్వగానే తనూ నవ్వి ఆ పేపర్లని చదువుతున్న వాడిలా షో చేసి కేష్ కౌంటర్ మీద పెట్టేడు.

'ముందు చెయ్యి కడుక్కునిరా' అని ఎర్రచొక్కా అతనితో చెప్పి ఆ ప్రక్కనే వున్న సాంబారావుకి పేపర్లు ఇచ్చేడు రవి.

సాంబారావు పేపర్లు తీసుకొని లోపలికి వెళ్లేడు.

ఆ ఎర్రచొక్కా అతనితోపాటు ఇంకో ఇద్దరు కూడా వచ్చారు.

''ఏరా...ఎక్కడుంటున్నావ్? నాకు L.I.C.లో జాబ్ వచ్చింది. నువ్వూ రాశావుగా ఏమైంది?''

త్వరత్వరగా ఆత్రంగా అడిగేడతను.

''ప్చ్... నాకు రాలేదురా... ఇంకా వేటలోనే వున్నాను'' అన్నాడు రవి.

''ఆ...బైదిబై... వీళ్లు నా కొలీగ్స్. ఇవ్వాళ జనరల్ బాడీ మీటింగ్ వుంది. తర్వాత అన్నీ మాట్లాడుకుందాం. ఏమైనా డబ్బు అవసరమైతే రా. ఇదిగో నా అడ్రసు'' అంటూ తన జేబులోని విజిటింగ్ కార్డ్ ఇచ్చాడు.

''డబ్బు అవసరమైతే రా'' ఆ మాటే పదేపదేసార్లు అంతరాత్మని శూలాలతో పొడుస్తున్నట్టుగా ఘోషిస్తూ మనసుని కలుక్కుమనిపించింది.

అతగాడిచ్చిన విజిటింగ్ కార్డ్ చూశాడు. కళ్లలో సన్నటి నీటి పొర ఆవరించింది.

ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఉద్యోగం వచ్చినా రాకపోయినా కూడా అతని జీవితం సుఖంగా వెళ్లిపోతోంది. ఒక్కడే కొడుకు, ఆస్తిపాలు అన్నీ వున్నాయి. ఆ ఎర్రచొక్కా అతను ఉద్యోగం కూడా ఏదో కాకతాళీయంగా తనతోపాటే అప్లై చేశాడు. తనింకా ఎన్నో అప్లై చేశాడు. అతనికంటే ఇతనికే పదిశాతం మార్కులెక్కువ. కానీ అదృష్టం అతన్ని వరించింది. తన స్నేహితులందరికీ లెక్చరర్ పోస్టులు. కాలేజీ కమిటీల్లో వేలకు వేలు గుప్పించి ఉద్యోగాన్ని పొందే తాహతు తనకు లేనందుకు అది తన దురదృష్టంగానే భావించాడు తప్ప ఏనాడూ అసూయపడలేదు. అందుకే సహనంతో పోరాడుతున్నాడు. కానీ తను డబ్బులేని వాడని తెలియడం వల్లే అన్న అతని మాటకి ఆవేదన చెందుతూ చేతిలో వున్న కార్డుని అప్రయత్నంగానే డస్ట్ బిన్‌లో పారేశాడు.

పేపర్లు తీసుకొని ఓనర్ తన పనిలో వుండిపోయాడు.

రవి మీల్స్ వడ్డనలోకి దిగిపోయాడు. హుషారుగా పనిచేయడంతో ఓనర్ రవిని ఏమీ అనలేదు.

రవి సప్లై చేస్తున్నాడే కాని అతని మనసంతా చికాకుగా వుంది.

ఈ రోజు జీతాలిచ్చే రోజు. మూన్నెళ్ళు అయిపోయింది చేరి. రేపట్నుంచి నాలుగో నెల. ఇంకా ఎక్కడా ఉద్యోగం జాడలు తెలియలేదు. ప్రతి బుధవారం హోటల్‌కి సెలవు. ఆ రోజే తన వేటకి బయలుదేరతాడు. ఎప్పుడైనా ఒక హాఫ్‌డే ఇంటర్వ్యూ ఏదైనా వుంటే సమందని చెప్పి ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు.

వచ్చిన కొత్తలో పది రోజులు పస్తులుండి తట్టుకోలేని పరిస్థితిలో ఈ పనిని ఎన్నుకోక తప్పలేదు. కానీ ఈ రోజు ఎర్రచొక్కా అతను తన స్నేహితుడు రఘురాం, రేపు ఇంకొకరు, ఎల్లుండి అయ్య... అమ్మో... చచ్చిపోయినా ఫరవాలేదు. కాని అయ్యకి తెలియకూడదు. అందుకే లెటర్లో నాలుగు రోజుల వరకూ పని దొరకలేదని రాశాను. ఈ నెల నుండా ఎం.ఓ. రేపు పంపాలి' కూరలు వడ్డిస్తూనే ఆలోచనలని నెమరు వేస్తున్నాడు రవి.

** *** ***

''బాబుగారూ... మా అబ్బిగాడు వెళ్ళిపోయి అయిదు నెల్లు అయిపోయింది. ఈ అయిదు నెల్లో ఆడు అంపిన ఏడొందలునే కర్చు పెట్టేత్తాననుకున్నాడు పిచ్చెదవ... అలాగే తీసికెళ్ళి మీరు చెప్పినట్టే మనూరు సొసైటీ బేంకీలో నేత్తావుంటే దీని సిగదరగా మేనేజరుగోరు సయితం కలకటేరుని చూసినట్టు నన్ను జోగయ్యగారూ అంటుండారయ్యా... బిడ్డొచ్చినేళా... గొడ్డొచ్చినేళా యని... మాదిగోడేంటి... జోగయ్యగారేంటి... ఇది కల అంటారా... నిజమంటారా?''

ఆనందంతో మురిసిపోతూ కొడుకు గురించి మాట్లాడుతున్నాడు మాష్టారితో జోగయ్య.

మాష్టారి మొఖం విచారగ్రస్తంగా వుండడంతో

''అదేంటి బాబుగారూ... అదోలా వున్నారు. ఎప్పుడూ ఎన్నెల్లా మెరిసిపోయే మీ సల్లని మొఖంలో ఏదో లోటనిపిత్తాంది''

''ఏం లేదు జోగయ్యా... ఏం చెప్పమంటావు? కొంత మంది పేరుకే పెద్దవాళ్లు కాని మనసులో కాదు. నాలుగు నెలలుగా జీతాలివ్వడం లేదు. ఆ విషయమై డి.ఇ.ఓ. గారితో మాట్లాడ్డానికి పట్నం వెడుతున్నాను. డబ్బుకి చాలా అవస్తగా వుందయ్యా''

''బాబుగారూ!'' ఆశ్చర్యంగా అన్నాడు జోగయ్య. మాష్టారు అవసరాన్ని గ్రహించి మాష్టారు తెల్సిన పెద్దవాళ్లందరి దగ్గరా అడిగి విఫలమయ్యారు.

జోగయ్య మాష్టారిచ్చిన బేంకు పుస్తకం తిరిగి తీసుకొని, ''బాబుగారూ... ఇది నేను సుఖపడడం కోసం ఆడు కష్టపడి నా కోసం అంపిన డబ్బు... మీకు సహాయం చెయ్యాలని వున్నా బేంకీలో డబ్బు మాత్రం నేను పాణం పోయినా తియ్యదల్చుకోలేదయ్యగారూ... ఈ పుస్తకం ఇంట్లో పెట్టి వస్తానుండండి'' అంటూ లోపలకెళ్లబోతుండగా మాష్టారు ''నేను వస్తాను జోగయ్యా'' అన్నారు నిరుత్సాహంగా. ''ఉండండి బాబుగారూ... మీతో మాట్లాడాలి'' అని లోపలకెళ్ళాడు జోగయ్య. అక్కడ గుడిసెలో వరండాలో వున్న చిన్న బల్లపై కూర్చున్నారు మాష్టారు. ''హు... పెద్దవాళ్లే సహాయం చెయ్యక పోగా... చిన్న వాడైన ఇతను సహాయం చెయ్యకపోయినా సానుభూతి అయినా చూపేడు. వాళ్లలో ఆ మంచితనమే లోపించడం... ప్చ్... అంతా నా ప్రారబ్ధం... ''

విచారంగా నిట్టూర్చారు మాష్టారు.

జోగయ్య చేతిలో 100 నోట్లు పెట్టుకొని మాష్టారి దగ్గరికి వచ్చాడు. మాష్టారు విస్మయంగా

'ఎల్లుండి నుంచే మీ పరీక్షలు. మీకు పరీక్షలో ఇచ్చే ప్రశ్నలు ప్రింటింగ్ ప్రెస్‌లో ఇవ్వడం కూడా అయి పోయింది. ఇంకా మీకేమన్నా డౌట్స్ వుంటే అడగండి' అంది టీచరు విద్యార్థులతో.
'ఆ ప్రింటింగ్ ప్రెస్ పేరు చెప్పండి టీచర్' అడిగిందో విద్యార్థి కంఠం.

—గొల్లపూడి శైలజ

కేవలం విస్తారమైన విజ్ఞానమే యెవరినీ మేధావిని చేయదు. పాండిత్యం యెంత వున్నా పండితుడే అవుతాడుగానీ మేధావి కాలేదు. సిద్ధాంత స్థాయిలో ఆలోచించేవాడే మేధావి. జీవితంలోనూ, సృష్టిలోనూ జరిగే ఘటనలు పరిశీలించి, వాటి వెనుక వున్న కారణాలు అన్వేషించి, అన్నిటినీ క్రోడీకరించి సూత్రబద్ధం చేసేవాడు - లేదా చేయడానికి ప్రయత్నించేవాడు - మేధావి. మేధావి చేయవలసిన కర్తవ్యం ఘటనల బాహ్య స్వరూపంతో తృప్తిపడకుండా వాటి వెనుక వున్న కారణాలను అన్వేషించడం. ఈ అన్వేషణకు ఆధునిక విజ్ఞానం తోడ్పడుతుంది గనుక విజ్ఞానం యెంత విస్తారంగా వుంటే మేధావి అంత ప్రయోజకుడౌతాడు

— రాచమల్లు రామచంద్రారెడ్డి

సేకరణ: తవుటు నాగభూషణం

మౌనంగా అతన్ని చూశారు.

''బాబుగారూ... ఈ డబ్బు నా కష్టార్జితం. మా అబ్బిగాడు ఇంకో నెల్లో ఇక్కడికి రాబోతున్నాడు. ఆడు వచ్చేలోపునే నేను ఆడికి మంచి గుడ్డలు తీయాలి! ఆడు వచ్చేలోపునే నేను ఆడిని కండ్లార నా కళ్ళతో చూసుకోవాలి!''

కొడుకుపై అతనికున్న మమకారానికి అచ్చెరువందారు మాష్టారు. జోగయ్య చెబుతూనే వున్నాడు.

''బాబుగారూ... ఆడు నన్ను రావద్దని రాశాడు బాబుగారూ... ఆడికి నా రెక్కల కష్టమయిన ఈ డబ్బెట్టి కొత్త గుడ్డలు తియ్యాలనుకుంటున్నాను బాబుగారూ... సుమారు ఎంతవుద్దంటారూ?''

'హే... భగవంతుడా... డబ్బు చూపిస్తూ ఎంత పరీక్ష పెడుతున్నావు? ఇంట్లో పొయ్యి వెలిగించి ఇవ్వాల్టికి మూడోరోజు. ఇతనినా అడగలేని పరిస్థితి. కామాక్షి సూత్రాలైనా కొదవుపెట్టి నెట్టుకురావాలి' భార్య కామాక్షి గురించి ఆలోచిస్తూనే, జోగయ్యని చూసి ''సుమారు... రెండు మూడొందలు కావచ్చు... కాలేజీ కుర్రాడు కదా'' అన్నారు మాష్టారు.

''బాబుగారూ... మీరెటూ పట్నం వెళ్తానంటున్నారు కదా. ఆడికి ఈ మూడొందలు పెట్టి గుడ్డలు తీసియ్యండి'' అంటూ మాష్టారి చేతిలో డబ్బు పెట్టాడు. చేతులకి తడి అయింది. జోగయ్య కన్నీరు కార్చడం చూసి,

''జోగయ్యా... ఎందుకు దిగులుపడతావు... నేవెళ్లి మీవాడ్ని చూసి వస్తానుగా. నువ్వెళ్ళినప్పుడు నేతెచ్చిన కొత్త గుడ్డలు తీసుకొని నువ్వు చూడ్డానికి వెళ్దువు గాని'' అతని భుజం తట్టి ఓదార్చారు మాష్టారు.

''నేవస్తాను జోగయ్య'' అంటూ వెళ్ళిపోతున్న మాష్టార్ని ''బాబూగారూ'' అంటూ పిలిచేడు.

ఆయన నిరాశగా జోగయ్య దగ్గరికివచ్చేరు.

''బాబుగారూ... పిచ్చి ఎదవనీ...! మీ కోసమనే డబ్బు తెచ్చి, కొడుకు గురించే ఆలోచిస్తూ మీకివ్వడం మర్చిపోయాను'' అంటూ చేతిలో వున్న డబ్బు మాష్టారికిచ్చేడు. డబ్బుతో పాటు కొడుకు అడ్రసున్న ఉత్తరం కూడా ఇచ్చాడు.

''జోగయ్యా... ఏమిటి నువ్వంటున్నది?''

ఆశ్చర్యంగా ఆనందాశ్రువులు కూడిన ఉద్వేగంతో అడిగారు.

''అవునండీ... ఈ పేదోడి డబ్బు అని, కులం తక్కువోడి డబ్బు అని, కాదనకండి. మీ అవసరాలకి ఉపయోగించండి. మీకు వచ్చిన తర్వాత ఇచ్చేద్దురు గాని'' అతనన్న మాటలకి స్థాణువులా వుండి పోయారు మాష్టారు. ఆయన దృష్టిలో వుండి కూడా లేదని చెప్పిన పెద్దవాళ్లని ఈ జోగయ్యతో పోలిస్తే వాళ్లెంతో, వాళ్ల పెద్దతనమెంతో తెలియకపోలేదు. అందుకే మాష్టారు మనసునిండా మంచితనాన్ని నింపుకుని, ''జోగయ్యగారూ... మేనేజరు పిలవడం కాదు నేను పిలుస్తున్నానండీ''

''బాబుగారూ... అంతమాటనకండి'' మాష్టారి కాళ్ళ మీద జోగయ్య పడబోతుంటే అతని వ్యక్తిత్వపు విలువలకు మెచ్చుకోలుగానే వద్దని చెపుతూ... ''సరే... నేవెళ్ళి మీ అబ్బాయిని చూసొస్తాను'' అని తిరిగి వెళ్తోన్న మాష్టారినే చూస్తుండిపోయాడు జోగయ్య.

మాష్టారు పట్నంలో పనులన్నీ చూసుకొని, 300 రూపాయిలకి ఫేంటూ, షర్టూ తీసుకొందామని షాపుకి వెళ్ళబోతూ, శంకరంని కల్సిన తర్వాత తీసుకుందామని అతని అడ్రస్సుకి జీడీల వెంకయ్య వీధి, షరాఫ్ బజార్ కెళ్లారు. ఆ ఇంట్లో అలాంటి వారెవ్వరూ లేరని చెప్పేసరికి నివ్వెరపోయారు. 'శంకరం జాడ తెలియని కారణంగా అమాయకుడైన ఆ జోగయ్యకి ఏం సమాధానం చెప్పాలా' అనుకుంటూ అప్పటికే సమయం 3 గంటలు అయినందున దగ్గర్లో వున్న హోటల్లో రెండు మెతుకులు కతకాలనే, ఆకలితో అక్కడికి వెళ్ళారు.

కృష్ణ హోటల్ రద్దీగానే వుంది. మాష్టారు బిల్లు తీసుకున్నారు.

భోజనం టేబుల్ దగ్గర కూర్చున్నారు. బిల్ తీసుకొని కూరలపెట్ గిన్నెలో రవి కూరలు వడ్డిస్తుండగా,

'శంకరం!' ఆశ్చర్యంగా రవిని పిలిచారు మాష్టారు.

రవి వెళ్ళిపోయాడు వేగంగా. వెనక్కి తిరిగి చూశారు మాష్టారు. అతను వంటశాల లోపలకి వెళ్ళిపోయాడు. ఆకులో అప్పడం వేస్తున్న సప్లయిర్ని ''కూరలు వడ్డించిన అతను శంకరం కదూ'' అడిగేరు మాష్టారు.

''లేదండీ, అతని పేరు రవి. మీరు ఎవరిని చూసి ఎవరనుకున్నారో'' అన్నాడు సప్లైయర్.

రవి లోపల వంటశాలలో సూపర్‌వైజర్‌తో ''నాకో అరగంట సర్వీస్‌కి రెస్ట్ ఇవ్వండి. తెల్సున్న కస్టమర్ వచ్చారు'' అన్నాడు.

దాంతో అతను మండిపడి, ''తెల్సున్న కస్టమర్ వుంటే తెలతెల్లగా తపేళాలు తోమేసెయ్... తెలియకుండా వుంటుంది'' కోపంగా అన్నాడు సూపర్‌వైజర్.

''అలాగేనండీ'' అంటూ కుళాయి దగ్గర వున్న తపేళాలు తోమటానికి అక్కడికి వెళ్ళాడు ఫేంట్ పైకి మడుస్తూ.

''శంకరం ఇటురా!'' తపేళాలు కడుగుతున్న శంకరంని పిలిచేరు మాష్టారు వంటశాల లోపలకి వచ్చి.

''మాష్టారూ'' కన్నీటి సుడులు తిరిగేయి శంకరానికి మాష్టార్ని చూడగానే.

''నా పేరు ఇక్కడ రవి'' మరలా అన్నాడు శంకరం.

''పేరేదైనా నువ్వు జోగయ్య కొడుకువి! నేను నీకు మాష్టార్ని. మీ నాన్న నిన్ను చూసి రమ్మన్నాడు. నువ్వు పంపిన డబ్బంతా బేంక్‌లో కట్టాడు. తన దగ్గరున్న డబ్బుతో నీకు బట్టలుకొని ఇవ్వాలను కుంటున్నాడు. నీ అడ్రసుకి వెడితే, నువ్వు లేకపోతే గాబరా పడ్డాను. అదే మీ నాన్న అయితే ఎంత కంగారు పడేవాడో''

''మాష్టారూ... నన్ను మన్నించండి. ఉద్యోగ ప్రయత్నంలో మరోదారి లేక మా అయ్యకి తప్పు అడ్రసు ఇచ్చాను. నన్నింత చదివించి నేనీ పని చెయ్యడం అయ్యకి తెలిస్తే మా అయ్య గుండె ఆగిపోతుంది. దయచేసి నన్నిలా చూసినట్టు మా అయ్యతో చెప్పకండి. నేను బాగానే వున్నానని చెప్పండి. నేనే తనని చూట్టానికి వస్తానని చెప్పండి'' ఏడుస్తూ, నమస్కరిస్తూ ప్రాధేయపడ్డ శంకరంని ఏమీ అనలేక, ''శంకరం! ఈ పని తప్పు పని కాదు. నీ ఉద్యోగం వస్తే మానేస్తావ్. వసుదేవుడంతటి వాడే గాడిదకాళ్లు పట్టుకున్నాడు. నీ కష్టాలన్నీ తీరిపోతాయి. నువ్వు పైకొస్తావ్. మీ నాన్నతో బావున్నావనే చెప్తాను. ఇక్కడున్నట్టు చెప్పను'' ఆనంద బాష్పాలు తుడుచుకుంటూ రవిని ఓదారుస్తూ భోంచేయకుండానే వెళ్ళిపోయారాయన.

''జోగయ్యా... నీ కొడుకు బ్రహ్మాండంగావున్నాడు. వాడి దగ్గరకి ఎవ్వరూ వెళ్లడానికి వీల్లేదు. నన్నే వెళ్లనివ్వలేదు. వాడెటూ నాలుగు రోజుల్లో వస్తానని చెప్పాడు'' అంటూ కొత్త పేంటు, షర్టు జోగయ్యకిచ్చేరు మాష్టారు.

జోగయ్య సంతోషం పట్టలేక కొడుకుని చూడాలనే తపనతో పట్నం వెళ్ళి శంకరం కనపడకపోయేసరికి విశ్వేష్టుడయ్యేడు. తిరిగి తిరిగి ఆకలితో హోటల్‌కి వెళ్లేడు. కూరలు వడ్డిస్తోన్న కొడుకునిచూసి బొటబొటా కన్నీరు కార్చేడు. శంకరం లోపలికెళ్ళిపోయాడు. జోగయ్య లోపలికెళ్ళి చూసేడు. లోపల లేదు. శంకరం ఇంటి అడ్రసు ఓనర్ ద్వారా తెలుసుకుని వెళ్లేసరికి తడిక తలుపు మూసి వుంది. తెరిచి లోపలకి వెళ్లాడు జోగయ్య. శంకరం వురేసుకున్నాడు! అతని జేబులో చీటీ వుంది. ''అయ్యా... ఎలా అయినా బ్రతకాలనీ నిన్ను బ్రతికించాలనీ ఆశపడ్డాను, మోసపోయాను. నువ్వే గెలిచావు'' చీటీ చదివి కొడుకు శవంపై కొత్త గుడ్డలు కప్పేడు జోగయ్య కన్నీళ్ళతో ●

ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే, దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే.

— రాచమల్లు రామచంద్రారెడ్డి

సేకరణ: తవుటు నాగభూషణం